క్లుప్తంగా

వైభవంగా కనకదుర్గమ్మ జాతర



ప్రత్యేక అలంకారంలో కనకదుర్గమ్మ

రామసముద్రం : మండల కేంద్రంలోని గాజులనగరంలో బుధవారం వైభవంగా కనకదుర్గమ్మ జాతర నిర్వహించారు. రెండు రోజుల పాటు జరిగిన జాతరలో మహిళలు ఉపవాసలతో దీపాలు, బోనాలతో మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలో గ్రామదేవతను కేరళ వాయిద్యాల నడుమ బాణా సంచా కాలుస్తూ ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. అమ్మవారిని పలు రకాల పుష్పాలతో అలంకరించారు.

ఆర్జేడీకి అభినందనలు



ఆర్జేడీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంఈఓ నారాయణ

పెద్దతిప్పసముద్రం : వైఎస్సార్ కడప జిల్లాకు నూతనంగా నియమితులైన ఆర్జేడీ శ్యామూల్‌ను బుధవారం ఎంఈఓ నారాయణ మర్యాద పూర్వకంగా కలసి పుష్ప గుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శ్యామూల్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ శక్తి వంచన లేకుండా కృషి చేయాలని సూచించినట్లు ఎంఈఓ పేర్కొన్నారు.

పార్టీ కార్యకర్తలకు అండగా నిలవాలి



మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన మాజీ ఎమ్మెల్యే చింతల

వాల్మీకిపురం : మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డిని బుధవారం విజయవాడలో పీలేరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. పీలేరు నియోజకవర్గ ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు అన్ని విధాలా అండగా ఉండాలని జగన్ సూచించినట్లు చింతల తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్‌కు పుష్పగుచ్ఛం అందించి దుశ్శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో చింతల రామచంద్రారెడ్డి కుమారుడు చింతల సాయిక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

గిరిజన స్టూడెంట్స్ ఫెడరేషన్ డివిజన్ ఇన్‌చార్జిగా వీరనాగయ్య



వీరనాగయ్యకు నియామకపత్రం ఇస్తున్న నాగేంద్రనాయక్

పీలేరురూరల్ : గిరిజన స్టూడెంట్స్ ఫెడరేషన్ మదనపల్లె డివిజన్ ఇన్‌చార్జిగా పీలేరుకు చెందిన వీరనాగయ్య ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు నాగేంద్రనాయక్ తెలిపారు. రాయచోటిలో జరిగిన యూనియన్ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు చెప్పారు. గిరిజన ప్రజలకు, గిరిజన విద్యార్థుల సమస్యల పరిష్కారానికి నూతన కమిటీ పని చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, రాయలసీమ ఇన్‌చార్జి పోలూరి రమేష్, జిల్లా అధ్యక్షులు నాగన్న తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుపై అవగాహన

పెనగలూరు : ఉద్యానశాఖ సువెన్ ఆగ్రో ఇండస్ట్రీ ఆధ్వర్యంలో బుధవారం ఆయిల్ పామ్ సాగుపై పెనగలూరు మండలంలోని కట్టావారిపల్లె, ఈటమాపురం, సింగారెడ్డిపల్లె గ్రామాలలో రైతులకు ఉద్యాన అధికారి జి సురేష్ బాబు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం అందించే రాయితీలను తెలియజేశారు. ప్రభుత్వం ఎంపిక చేసిన కంపెనీ ద్వారా రైతులకు హెక్టార్‌కు 143 మొక్కలను ఉచితంగా పంపిణీ చేస్తుందన్నారు. మొదట నాలుగు సంవత్సరాలకు ఒక్కో సంవత్సరానికి రూ. 5,250 చొప్పున మొత్తం నాలుగు సంవత్సరాలుగా రూ. 21 వేలు, అలాగే అంతర పంటల సాగుచేస్తే మొదటి నాలుగేళ్లకు రూ. 21 వేలు రాయితీ రైతు ఖాతాలో జమ చేయడం జరుగుతుందని, కావున రైతులు ప్రత్యామ్నాయ పంటగా ఆయిల్ పామ్ సాగుకు రైతు సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

అటవీ ప్రాంగణంలో పక్షుల కేంద్రం

- రూ.2 కోట్లతో ఏర్పాటుకు ముందుకొచ్చిన ప్రైవేటు సంస్థ
- ప్రభుత్వ పరిశీలనలో ప్రతిపాదన



హార్సిలీహిల్స్ అటవీ ప్రాంగణం

బి.కొత్తకోట : బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పైనున్న అటవీశాఖ ప్రాంగణంలో పక్షుల ప్రదర్శన కేంద్రం (ఫండేరా పార్కు)ను కొత్తగా ఏర్పాటు చేసేందుకు తమినాడుకు చెందిన ప్రైవేటు సంస్థ ముందుకొచ్చింది. ప్రస్తుతం అటవీ ప్రాంగణంలో పక్షులు, వన్యప్రాణులతో జంతుప్రదర్శనశాల నిర్వహణ సాగుతోంది. గతంలో విశేషమైన, అరుదైన పక్షులు, వన్యప్రాణులు ఇక్కడ ఉండేవి. కాలగమనంలో అవి మృత్యువాతపడటం, వివిధ కారణాలతో మాయం కావడం జరుగుతూ వచ్చాయి. ప్రస్తుతం జంతుప్రదర్శనశాల బోసిపోతోమది. ఈ నేపథ్యంలో తమిళనాడులోని యాలగిరిహిల్స్‌లో ఫండర్ పార్క్ నిర్వహణ చేస్తున్న విశ్వక్‌నాథ్ అటవీప్రాంగణంలో ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చాడు. రూ.2 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసే ఈ కేంద్రానికి ఎకరా భూమి అవసరం అవుతుంది. అందులో దేశ, విదేశాలకు చెందిన రకరకాల పక్షులు, వన్యప్రాణులను ఉంచేందుకు ప్రత్యేక నివాసాలను ఏర్పాటు చేయడమేకాక వాటిని వెలుపలి నుంచి సందర్శకులు చూసి వెళ్లడం కాకుండా ఫండర్ పార్కులోకే వెళ్లి కలియ తిరిగి వీక్షించేలా ఏర్పాట్లు ఉంటాయి. దీని కోసం మదనపల్లె రేంజర్ మదన్‌మోహన్‌రెడ్డి అటవీ ప్రాంగణంలోని మరుగుదొడ్లు ఉన్న ప్రదేశాన్ని చూపించగా ఇందుకు సరైన స్థలమని నిర్ణయించారు. ఈ కేంద్రం ఏర్పాటు కోసం ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయాల్సిన అవసరం లేదు. ప్రైవేటు సంస్థే నిధులు వెచ్చించి ఏర్పాటు చేస్తుంది. కొన్నేళ్ల వరకు దీన్ని నిర్వహణ బాధ్యతలను చూసి వచ్చే ఆదాయంలో ప్రభుత్వానికి ఎంత ఇవ్వాలో నిర్ణయిస్తే ఆ వాటాను చెల్లిస్తారు. ఇలాంటి కేంద్రాలు తమిళనాడులో ఉండటంతో అక్కడి పర్యాటకులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. హార్సిలీహిల్స్‌పై ఏర్పాటు చేసేందుకు అనుమతులకు సంబంధించి ప్రైవేటు సంస్థ ఇప్పటికే ప్రభుత్వాన్ని సంప్రదించినట్లు తెలిసింది. దీనికి ఆమోదం లభిస్తే కొండపై పర్యాటకులకు కొత్త అనుభూతి దక్కుతుంది. దీనిపై మదనపల్లె రేంజర్ మదన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ విశ్వక్‌నాథ్ అనే వ్యక్తి తమను సంప్రదించగా అటవీప్రాంగణాన్ని చూపించామని, ప్రభుత్వ అనుమతి కోసం ఉన్నతాధికారుల వద్దకు వెళ్లినట్లు చెప్పారు.

జిల్లా ఆస్పత్రిలో రెఫరల్ కేసులు తగ్గించాలి

- పారిశుధ్య నిర్వహణపై ఎమ్మెల్యే ఆగ్రహం
- విద్య, వైద్యం అంశాల్లో రాజీపడే ప్రసక్తి లేదు
- మెరుగైన వసతులు కల్పించే దిశగా చర్యలు



జిల్లా ఆస్పత్రిలో సేవలపై రోగులను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె : ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో రెఫరల్ కేసులు తగ్గించి రోగులకు స్థానికంగానే వైద్యసేవలు అందించాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆదేశించారు. బుధవారం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ జమున, సూపరిండెంట్ ఎం.ఎస్.రాజు, ఆర్ఎంఓ ప్రసాదరాజుతో కలిసి ఆస్పత్రిలోని అన్ని వార్డులను పరిశీలించారు. వార్డుల్లో రోగులకు అందుతున్న సేవలు, వసతులపై అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో పారిశుధ్య నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, తక్షణమే కాంట్రాక్ట్ ఏజెన్సీని మార్చడం లేదా, రద్దుచేసేలా చర్యలు తీసుకోవాలని మెడికల్ సూపరిండెంట్‌ను ఆదేశించారు. ఆస్పత్రిలో రోగులకు సరిపడా నర్సులు లేరని, కనీసం 80 మంది నర్సులు అవసరం ఉండగా, 24 మందితో సేవలందించడంపై ప్రశ్నించారు. విద్య, వైద్యం తన పాలనలో ప్రాధాన్యత అంశాలని, ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీపడే ప్రసక్తి లేదన్నారు. జిల్లా ఆస్పత్రిలో మెరుగైన వసతులు కల్పించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. మదనపల్లె జిల్లా ఆస్పత్రికి ప్రతిరోజు పుంగనూరు, తంబళ్లపల్లె, పీలేరు, కర్నాటక నుంచి సుమారు 1200 మంది అవుట్‌పేషెంట్లు, గైనిక్, జనరల్ సేవలకు వందల సంఖ్యలో రోగులు వస్తుంటారని, వీరందరికీ నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు ఆస్పత్రిని బలోపేతం దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. మెడికల్ కాలేజీ సిబ్బంది సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకుంటామన్నారు. ఆస్పత్రి పైభాగంలో నిర్మించిన నూతన భవనాలకు వెళ్లేందుకు ర్యాంపు నిర్మాణం వారంలోపు పూర్తిచేయాలని ఆదేశించారు.

ఆయకట్టు రైతులు నీటి తీరువా చెల్లించాలి

మదనపల్లె ఆర్డీవో హరిప్రసాద్



బాహుదా ప్రాజెక్టు పరిశీలిస్తున్న ఆర్డీవో హరిప్రసాద్

నిమ్మనపల్లె : బాహుదా సాగునీటి ప్రాజెక్టు కింద పంటలు సాగు చేస్తున్న ఆయకట్టు రైతులు ప్రభుత్వానికి నీటి తీరువా (పన్ను) చెల్లించాలని మదనపల్లె ఆర్డీవో హరిప్రసాద్ అన్నారు. బుధవారం ఆయన తహసీల్దార్ బాలాజీరావుతో కలిసి బాహుదా ప్రాజెక్టును పరిశీలించారు. ప్రాజెక్టు నిర్వహణ, నీటి లభ్యత, ప్రాజెక్టు సామర్థ్యం, ఆయకట్టు భూమి, పంటలు సాగు చేస్తున్న రైతుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 0.4 టీఎంసీల సామర్థ్యంతో సాగు నీటి అవసరాలు తీర్చుతున్న బాహుదా ప్రాజెక్టు ప్రధానమైనదన్నారు. ప్రాజెక్టు పరిధిలో నిమ్మనపల్లె, వాల్మీకిపురం మండలాలకు సంబంధించిన 2,800 ఎకరాల భూమి ఉందన్నారు. వర్షాధారంతోనే ప్రాజెక్టు నిండే పరిస్థితి ఉందన్నారు. ఈ సమస్యను పరిష్కరించడానికి హంద్రీనీవా జలాలను బాహుదా ప్రాజెక్టుకు అనుసంధానం చేయాలని రైతులు కోరారన్నారు. వారి అభ్యర్థనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఆయకట్టు రైతులు ప్రతి ఏడాది ఎకరానికి రూ.200 చొప్పున నీటి తీరువా చెల్లించాలన్నారు. ప్రాజెక్టులో మత్య సంపదను మరింత అభివృద్ధి చేయాలని అధికారులను సూచించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఏఈ శ్రీధర్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

25 వరకు పాఠశాలల్లో ప్రవేశాలకు గడువు

కలకడ : ఈ విద్యాసంవత్సరంలో పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలకు 25వతేది వరకు ప్రభుత్వం గడువునిచ్చిందని, మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థుల నమోదుకు కృషి చేయాలని ఎంఈఓ మునీంద్రనాయక్ అన్నారు. బుధవారం కె.బాటవారిపల్లె ఎంఆర్‌సీ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి ప్రసంగించారు. విద్యార్థులకు ఆన్‌లైన్ పద్ధతిలో ఒక్కచోట మాత్రమే నమోదుకు అవకాశం ఉందని, గ్రామాలు మారినా, పాఠశాల నుంచి మరో పాఠశాలకు బదిలీ అయినా ఆధార్‌కార్డు నమోదుతో 25వ తేదివరకు విద్యాప్రవేశం ఉందని గుర్తు చేశారు. పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచాలని, నీటి సమస్య రాకుండా, గదుల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

ఆదర్శ డిపోగా తీర్చిదిద్దాలి



ప్రశంసాపత్రం అందుకుంటున్న కండక్టర్ పివిబి రెడ్డి

మదనపల్లె సిటీ : ప్రయాణికుల మన్ననలు పొంది ఆదర్శ డిపోగా తీర్చిదిద్దాలని ఆర్టీసీ-1 మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి అన్నారు. బుధవారం ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ నిర్వహించారు. జూన్ నెలలో ఓఆర్‌లో 70 శాతం, కెఎంపిఎల్ 5.39 శాతం సాధించి రీజియన్‌లో మొదటి, రెండవ స్థానాలు కైవసం చేసుకున్నట్లు తెలిపారు. సంస్థకు ఆదాయం వస్తే మరిన్ని సౌకర్యాలు కల్పిస్తారన్నారు. అందరూ సమిష్టిగా పని చేయాలని కోరారు. టార్గెట్ ఆదాయంలో మొదటి స్థానం కె.సి.మస్తాన్, రెండవ స్థానం కమలమ్మ, అమరావతిలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అత్యధిక ఈపీకే సాధించిన సూపర్ లగ్జరీ నాగరాజు, ఎక్స్‌ప్రెస్‌లో పివిబి రెడ్డి, పల్లెవెలుగులో బిసి నాయక్‌లకు ప్రోత్సాహక బహుమతులు అందుకున్నారు. కార్యక్రమంలో జ్ఞానోదయ పాఠశాల కరస్పాండెంట్ కామకోటి ప్రసాదరావు, సీఐ రేవతి, సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ కార్మిక విధానాలపై నిరసన



నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

మదనపల్లె : కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని ఐసీడీయస్ కార్యాలయం ఎదుట అఖిల భారత కోర్కెల దినం నిర్వహించారు. అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వరి, ప్రాజెక్ట్ అధ్యక్షురాలు మధురవాణి, సీఐటీయూ జిల్లా కోశాధికారి హరిశర్మల నాయకత్వంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కార్మికులు ఎంతో పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు కోడ్ల రూపంలో తీసుకువచ్చిన నల్లచట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కనీసవేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం తక్కువ మెజారిటీతో గెలిచినప్పటికీ ప్రైవేటీకరణ విధానాలను కొనసాగిస్తున్నదని, దీనివల్ల ప్రజలకు ప్రయోజనం ఉండదన్నారు. కార్మికహక్కులపై జరుగుతున్న దాడిని ఖండించారు. కాంట్రాక్ట్ కార్మికులను అందరినీ రెగ్యులరైజ్ చేయాలన్నారు. అంగన్‌వాడీ సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చి శ్రమకు తగిన వేతనం ఇవ్వాలని కోరారు. అంగన్‌వాడీ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగభద్రత కల్పించాలని, మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా మార్చాలని, రాజకీయ వేధింపులు ఆపాలని నినాదాలు చేశారు. అనంతరం ఐసీడీయస్ జిల్లా పీడీ శశికళకు వినతిపత్రం సమర్పించారు. అలాగే దేశవ్యాప్త కోర్కెలదినంలో భాగంగా ఆశావర్కర్లు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆశాలతో ఇతర పనులు చేయించవద్దని, ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలు నశించాలని తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో భాగ్యమ్మ, విజయ, మధుమతి, సుగుణ, లక్ష్మీదేవి, సుజన, అనసూయ, గీత, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

శాకాంబరి అలంకారంలో అమ్మవారు



శాకాంబరి అలంకారంలో గాయిత్రి అమ్మవారు

మదనపల్లె సిటీ : వారాహీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక అయ్యప్పనగర్‌లో వెలసిన శ్రీ బాల అయ్యప్పస్వామి ఆలయంలో గాయిత్రి అమ్మవారిని శాకాంబరి అలంకారం చేశారు. వివిధ కూరగాయలతో అమ్మవారికి పూలదండలుగా తయారు చేసి ప్రత్యేక అలంకరణ చేశారు. స్థానిక దేవళంవీధిలోని శ్రీ సోమేశ్వరస్వామి ఆలయంలో శ్రీ లలిత త్రిపుర సుందరిదేవి అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. వారాహి అష్టోత్తరం, లలిత సహస్ర నామస్తోత్రపారాయణం చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి



ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్న దృశ్యం

పీలేరు : విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని రిటైర్డ్ జడ్జి వి. శ్రీనివాస ఆంజనేయమూర్తి అన్నారు. బుధవారం స్థానిక ట్రాన్స్‌కో డివిజన్ కార్యాలయంలో ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ అదాలత్ చైర్మన్‌గా వ్యవహరించిన ఆయన మాట్లాడుతూ మొత్తం ఐదు సమస్యలు తమ దృష్టికి రాగా నాలుగు సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించినట్లు తెలిపారు. మరో సమస్య త్వరలో పరిష్కారం అవుతుందన్నారు. ఆర్థిక సభ్యులు కె. రామ్మోహన్‌రావు, సాంకేతిక సభ్యులు ఎస్.ఎల్. అంజనికుమార్, స్వతంత్ర్య సభ్యులు జి. ఈశ్వరమ్మ, ఇన్‌చార్జి ట్రాన్స్‌కో ఈఈ ఎం. మునిచంద్ర, ఏడీఈ సుధాకర్, అధికారులు, వినియోగదారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



సీడీపీఓ భారతికి వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీలు

వాల్మీకిపురం : తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ వాల్మీకిపురం ఐసీడీఎస్ పరిధిలోని గుర్రంకొండ, వాల్మీకిపురం, కలకడ, కలికిరి మండలాలకు చెందిన అంగన్‌వాడీలు బుధవారం స్థానిక సీడీపీఓ కార్యాలయం వద్ద మూకుమ్మడిగా ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీడీపీఓ భారతికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీల నాయకురాలు మాట్లాడుతూ ఐసీడీఎస్‌లను బలోపేతం చేయడంతో పాటు అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, అలాగే సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. అలాగే అంగన్‌వాడీలను వేధింపులకు గురి చేస్తున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అంగన్‌వాడీలు భూకై లేశ్వరి, అమ్మాజి, చంద్రావతి, నజీమున్నిసా, సంపూర్ణ, శ్రావణి, గ్రాయితీ, సురేఖ, వసుంధర, లక్ష్మీనరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



గర్భిణులకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

రామసముద్రం : స్థానిక పీహెచ్‌సీలో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం 100 మంది గర్భిణులకు డాక్టర్ లీలా వైద్య పరీక్షలు చేసి పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ప్రతి గర్భిణికి బీపీ, షుగర్, హెచ్‌బి, మూత్ర పరీక్షలు, హెచ్ఐవీ, హెచ్‌బీఎస్, బరువు, ఎత్తు, తనిఖీ చేసి ఉచితంగా కాల్షియం ,బికాంప్లెక్స్ , ఐరన్, ఫోలిక్ మాత్రలు ఇచ్చారు. ప్రతి నెలా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. గుడ్లు, పాలు, కూరగాయలు, ఆకుకూరలు, బెల్లం, రాగిమాల్ట్, మునగాకు వంటి మంచి పౌష్టికారం తీసుకోవాలన్నారు. ఏ ఒక్క గర్భిణి కూడా రక్తహీనతతో బాధపడకూడదని సూచించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

రాజంపేట: నియోజకవర్గంలోని ప్రజల సమస్యలు పరిష్కరించడమే తన ధ్యేయమని రాజంపేట శాసనసభ్యుడు ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం నూతన జిల్లా కలెక్టర్ శ్రీధర్‌తో ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి భేటి అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని రాజంపేట మున్సిపాలిటీ, రాజంపేట రూరల్ , నందలూరు, సుండుపల్లె, వీరబల్లి, సిద్ధవటం, ఒంటిమిట్ట మండలాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు ఎప్పటికప్పుడూ గుర్తించి వాటి పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. ప్రజలసమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు.

సమష్టి కృషితో డయేరియాను నివారిద్దాం



కలకడ : డయేరియా నివారణపై అవగాహన

పీలేరురూరల్ : సమష్టి కృషితో డయేరియాను నివారిద్దామని డాక్టర్ కార్తీక్ అన్నారు. బుధవారం స్థానిక యర్రమరెడ్డి గుట్టలో రేగళ్లు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాల లోపు పిల్లల మరణాలకు నీళ్ల విరేచనాలు ప్రధాన కారణమని తెలిపారు. పిల్లలు ఉన్న ప్రతి ఇంటికి రెండు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వాటర్ ట్యాంకులు శుభ్రం చేసుకోవాలని తెలిపారు. పిల్లలకు టీకాలు, విటమిన్ ఏ ద్రావణం సకాలంలో ఇప్పించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో జయలక్ష్మీ, సూపర్‌వైజర్ చిన్నప్ప, ఆరోగ్య కార్యకర్త భవాని, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓఆర్ఎస్‌తో డయేరియా నివారణ

కలకడ : ఓఆర్ఎస్‌తో డయేరియా నుంచి విముక్తి పొందవచ్చునని మండలంలోని ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం కె.దొడ్డిపల్లె సచివాలయం పరిధిలోని కత్తివారిపల్లెలో స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని నిర్వహిచారు. నీళ్ల విరేచనాల లక్షణాలు తెలియజేసి ఓఆర్ఎస్ వినియోగంపై డెమో చేసి చూపించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. గ్రామంలో అతిసార కేసులు లేవని, ఎలాంటి అనుమానాలు ఉన్నా ప్రభుత్వ ఆసుపత్రిలో చేరాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ ఈఓ జయరామయ్య, పీహెచ్ఎన్ సుబ్బరత్నమ్మ, సూపర్‌వైజర్లు వెంకటేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పి గోపిక్రిష్ణ, అమరావతి, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

డయేరియాపై విద్యార్థులకు అవగాహన

రామసముద్రం : డయేరియాకు గురికాకుండ ప్రతి ఒక్కరూ వ్యక్తి గత పరిశుభ్రత పాటించాలని ప్రభుత్వ పాఠశాలల్లో వైద్య సిబ్బంది విద్యార్థులకు అవగాహన కల్పించారు. బుధవారం రామసముద్రం తూర్పుపాఠశాలలో పిల్లలకు హ్యాండ్‌వాష్, ఓఆర్ఎస్ ద్రావణం వాడకంపై సూచనలిచ్చారు. కాచి వడపోసిన లీటర్ నీటిలో ఒక ప్యాకెట్ కలుపుని తాగాలన్నారు. వాటర్ ట్యాంకులు శుభ్రం చేసిన నీటిని సేవించాలన్నారు. కార్యక్రమంలో ఈస్ట్ స్కూల్ హెచ్ఎం హేమలత, వైద్య సిబ్బంది రాజేశ్వరి, హసీనా, శశికళ పాల్గొన్నారు.



రామసముద్రం : అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది



పీలేరు : డయేరియా నివారణ కార్యక్రమంలో ఆరోగ్య అధికారులు

